సాక్షి
కర్నూలు
ఆదివారం । 24 । ఆగస్టు । 2025



దోపిడీ రూ. కోటిపైనే!

టెంకాయ దక్షిణ మాటున ఉరుకుంద క్షేత్రంలో ఓ భారీ దందా సాగుతోంది. ఈ దోపిడీ రూ.కోటి పైగానే ఉన్నట్లు తెలుస్తోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. 8లో▸



పత్రాల జారీలో ఆలస్యం

కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈసీలు, మార్కెట్ విలువ పత్రాల జారీలో తీవ్ర ఆలస్యం జరుగుతోంది. దీంతో క్రయ, విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625.23
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:74.968
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:77,244
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:55,393

న్యూస్‌రీల్

కోర్టు ఉద్యోగాలకు పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి

కర్నూలు: దిగువ కోర్టులలో వివిధ ఉద్యోగాల భర్తీకి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న పరీక్షలను ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి, నంద్యాల మూడో అదనపు జిల్లా జడ్జి అమ్మన్న రాజా శనివారం పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఏ విధమైన అసౌకర్యం, ఇబ్బందులు కలుగకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: గణేష్ ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వినాయక చవితి వేడుకల సందర్భంగా పాటించాల్సిన పోలీస్ నియమ నిబంధనలు, ప్రజలు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై శనివారం ఎస్పీ ప్రకటన విడుదల చేశారు. నిర్వాహకులు మండపాల ఏర్పాటు, ఊరేగింపు నిర్వహణకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. సింగిల్ విండో విధానంలో అనుమతులు సులభంగా పొందవచ్చన్నారు. మండపాల వద్ద విధిగా ఒకరు కాపలాగా ఉండాలని, సీసీ కెమెరాలు కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అధిక శబ్దం చేసే డీజే సౌండ్ సిస్టమ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించరాదన్నారు.

ఉద్యాన శాఖ ఏడీలకు పదోన్నతి

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యానశాఖలో పలువురు సహాయ సంచాలకులకు ఉప సంచాలకులుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ ఆమోదం తెలిపింది. రాష్ట్రం మొత్తం మీద ఆరుగురు అసిస్టెంట్ డైరెక్టర్లకు పదోన్నతులు ఖరారయ్యాయి. ఇందులో జిల్లా ఉద్యాన అధికారి పి.రాంమాజనేయులు, నంద్యాల జిల్లా ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ ఉన్నారు. పదోన్నతులకు సంబంధించిన ఉత్తర్వులు రెండు, మూడు రోజుల్లో వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ ప్రజల ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేయవచ్చన్నారు. meekosam.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

రేపు మూడు కేంద్రాల్లో సర్టిఫికెట్ల పరిశీలన

- ఉమ్మడి జిల్లాలో 2,645 టీచర్ పోస్టులు
- మొత్తం 53,733 మంది అభ్యర్థులు దరఖాస్తు
- ఎస్జీటీ పోస్టుల కటాఫ్‌పై అభ్యర్థుల్లో ఆందోళన
- ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు



లక్ష్య సాధకులై.. బోధనకు చేరువై!

కర్నూలు సిటీ: డీఎస్సీలో మంచి ర్యాంకులు సాధించి ఉపాధ్యాయులు కావాలనే లక్ష్యాన్ని కొందరు సాధించారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు సిద్ధమయ్యారు. ఇందుకు మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యధికంగా 2,645 టీచర్ పోస్టులు భర్తీ కానున్నాయి. విద్యాశాఖ గతంలో ఎప్పుడు లేని విధంగా రాత పరీక్షలు నెల రోజుల పాటు నిర్వహించింది. నార్మలైజేషన్ పేరుతో నిరుద్యోగుల్లో గతంలో ఎప్పుడూ లేని విధంగా భయాందోళన కలిగించారు. రేపటి(సోమవారం)నుంచి ఎంపిక చేసిన మూడు కేంద్రాలు రాయలసీమ యూనివర్సిటీ, శ్రీలక్ష్మీ శ్రీనివాస బీఈడీ కాలేజీ, రాఘవేంద్ర బీఈడీ కాలేజీల్లో సర్టిఫికెట్లను పరిశీలన చేయనున్నారు. డీఎస్సీకి ఎంపికైన వారి సర్టిఫికెట్ల పరిశీలనకు జిల్లా విద్యాశాఖ, రెవెన్యూ అధికారులు 216 మందితో 54 టీఎంలు, 170 మంది వలంటరీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. అభ్యర్థుల అనుమానాలు నివృత్తి చేసుకునేందుకు ప్రత్యేకంగా జిల్లా విద్యాశాఖ టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేశారు. 21 క్యాటగిరి పోస్టులలో కటాఫ్ మార్కులపై అభ్యర్థుల్లో ఉత్కంఠనను కలిగిస్తుంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ క్యాటగిరీల్లో మార్కులు అత్యధికంగా ఉన్నాయి. ఎక్కడికి కటాఫ్ అవుతుందో అనే ఆందోళన అభ్యర్థుల్లో నెలకొంది. ఉమ్మడి జిల్లాలో 2,645 పోస్టులకు 53,733 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 95 శాతం క్వాలిఫై అయ్యారు.

అత్యధిక మార్కులు సాధించినవారు...

స్కూల్ అసిస్టెంట్ విభాగం...

- తెలుగు సబ్జెక్టులో 82 పోస్టులకు గాను 2,891 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో అత్యధికంగా కె.మహేష్ బాబు అత్యధికంగా 85.62(ఈయన పీజీటీ తెలుగులో జోన్–4లో 3వ ర్యాంకు), ఎ.మధుసూదన్ 84.40, కేవీ లక్ష్మీదేవమ్మ 83.37 మార్కులు సాధించారు.
- ఇంగ్లిష్ సబ్జెక్టులో 81 పోస్టులకు గాను 1,850 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో సాయి నవీన్ 85.87, కె.రమేష్ బాబు 85.19, జె.విజయభారతి 83.98(ఈమె పీజీటీ ఇంగ్లిష్‌లో జోన్–4లో 2వ ర్యాంకు) మార్కులు సాధించారు.
- హిందీ సబ్జెక్టులో 144 పోస్టులకు గాను 1,476 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. ఇందులో నసీరుద్దీన్ ముల్లా 82.37, ఎస్.సుశీల 80.05, ఎ.మనోహర్ 79.64 మార్కులు సాధించారు.
- బయాలజీలో 74 పోస్టులకు గాను 3,948 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. వి.నాగరాజు 85.67, ఎం.బాలస్వామి 85.62(పీజీటీలో స్టేట్‌లో 7వ ర్యాంకు, జోన్–4లో 5వ ర్యాంకు), పి.స్వర్ణలత 84.67 మార్కులు సాధించారు.
- గణితం సబ్జెక్టులో 90 పోస్టులు ఉండగా 4,281 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. ఎ.వెంకటరామిరెడ్డి 85.18, జె.జ్యోతి రాంప్రసాద్ 84.43, వి.ఇంద్రాణి 84.34 మార్కులు సాధించారు.
- ఫిజికల్ సైన్స్‌లో 52 పోస్టులకు గాను 1,640 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. వై.వెంకటలింగారెడ్డి 81.04, బి.రెడ్డన్న 79.27, జి.కృష్ణమూర్తి 78.89 మార్కులు సాధించారు.
- సోషల్ సబ్జెక్టులో 112 పోస్టులకు గాను 5,598 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. సి.పరుశురాముడు 87.34, జి.కోదండరాముడు 86.07, బి.నర్సప్ప 84.66 మార్కులు సాధించారు.
- ఎజీటీ విభాగంలో 1817 పోస్టులు ఉండగా మొత్తం 27,536 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో బి.లావణ్య 94.53, కె.శారద 93.27, శ్రీరామ్ హనుమంతు 92.63, యు.నాగరాజు 92.53, కాటసాని నాగామృత 92.27, బి.షమీల 92.12, ఎం.మమత 91.95, ఎన్పీ సుబ్బలక్ష్మయ్య 91.86, ఎం.వేణుగోపాల్ 91.29, సి.పుష్కరిణి 91.26 మార్కులు సాధించారు.

ఏం చేయాలంటే..

- ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలి.
- డీఎస్సీ వెబ్‌సైట్ నుంచి ఇంటిమేషన్ లెటరును డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు 5 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలి.
- అటెస్టెడ్ చేసిన మూడు కాపీలను ఒక ఫోల్డర్‌లో భద్రపరుచుకోని రావాలి.
- ఫోల్డర్‌పై అభ్యర్థి హాల్ టికెట్ నంబరు రాయాలి.

హెల్ప్ డెస్క్ ఏర్పాటు

డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, ఏదైనా సమస్యలు వస్తే సహాయం చేసేందుకు ప్రత్యేకంగా జిల్లా విద్యాశాఖ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసింది. ఇందులో ముగ్గురు ఉద్యోగులు నర్సయ్య 8121821266, బాదుల్లా(సూపరింటెండెంట్, డీఈఓ ఆఫీస్) 9603683182, కె. నాగభూషణం (డీఈఓ ఆఫీస్ ఏడీ) 9177679042 నంబర్లను సంప్రదించవచ్చు.

కూలీ బిడ్డకు మూడు పోస్టులు



కె. మహేష్ బాబు

కల్లూరు: డీఎస్సీ ఫలితాల్లో కూలీ బిడ్డకు మూడు పోస్టులు వచ్చాయి. టీజీటీలో 85.20 మార్కులతో స్టేట్ టాపర్‌గా, పీజీటీలో 84 మార్కులతో జోన్–4 టాపర్‌గా, స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 85.62 మార్కులతో కర్నూలు జిల్లా టాపర్‌గా నిలిచాడు. కల్లూరు మండలం పెద్దపాడుకు చెందిన కె.వెంకటేశ్వర్లు, పార్వతి దంపతుల పెద్ద కుమారుడైన కె.మహేష్‌బాబు విజయగాథ ఇదీ.. రాయలసీమ యూనివర్సిటీలో ఈయన తెలుగులో పీహెచ్‌డీ చదువుతున్నాడు. తల్లిదండ్రులు ప్రతిరోజూ కర్నూలుకు వచ్చి పనులు చేస్తూ కుమారుడిని చదివించారు. తల్లిదండ్రుల కష్టాన్ని చూసిన కుమారుడు డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి రోజుకు 8 గంటలపాటు చదివారు. ఆయన శ్రమకు ఫలితంగా డీఎస్సీలో మూడు పోస్టులు వరించాయి.

‘కన్నడ’లో మెరిసి...



పూజారి చాముండి

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామానికి చెందిన పూజారి సోమలింగ కుమార్తె పూజారి చాముండికి స్కూల్ అసిస్టెంట్ బయాలాజికల్ సైన్స్ (కన్నడ)లో జిల్లాస్థాయిలో ప్రథమ ర్యాంకు వచ్చింది. మార్కులు 68.80 వచ్చినట్లు చాముండి శనివారం తెలిపారు. తాను కర్నూలులోని కోచింగ్ సెంటర్‌లో ఒక సంవత్సరం పాటు కోచింగ్ తీసుకుని కష్టపడి చదివినట్లు చెప్పారు. తాను 1–10వ తరగతి వరకు గూళ్యంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో చదివినట్లు తెలిపారు. తనను తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సహించారన్నారు.

చెట్టు కింద జీవన వెలుగు



చెట్టు కింద వంట చేసుకుంటున్న పద్మమ్మ

‘ఆస్తులు లేవు.. బంధువులు లేరు.. హోదా లేదు.. తోడా నీడా కరువైంది’ అని సమాజంలో బాధపడే వారు చాలా మంది ఉన్నారు. ఇవేమీ లేకున్నా కొంతమంది పది మందికి సాయం అందిస్తూ జీవనాన్ని వెలిగిస్తున్నారు. మంత్రాలయానికి చెందిన బెస్త పద్మమ్మను ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఈమెకు 30 ఏళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రం మాన్వి తాలూకా పరిధిలోని వీరాపురం గ్రామానికి నాగేంద్రప్పతో వివాహమైంది. అనారోగ్యంతో భర్త తనువు చాలించడంతో ఆమె ఒంటరి మహిళగా కూలి పనులు చేసుకుంటూ మంత్రాలయంలో జీవనం సాగిస్తున్నారు. ఆమె దుస్థితి చూసి 24 ఏళ్ల క్రితం రాఘవేంద్రపురంలో ప్రభుత్వం నివాస స్థలం ఇవ్వగా కొందరి వికృత చేష్టలతో ఆమె అక్కడి నుంచి బయటకు వచ్చేశారు. ప్రస్తుతం మంత్రాలయంలోని కర్ణాటక అతిథిగృహం కాంపౌండ్ చాటున చెట్టు కింద జీవనం సాగిస్తున్నారు. వానొస్తే తల దాచుకోవడానికి ఆమెకు స్థలం లేదు. గోడను ఆసరాగా చేసుకుని జీవనం సాగిస్తున్నారు. తనకు అండగా ఎవరూ లేకున్నా పది మంది సాయం చేస్తున్నారు. – మంత్రాలయం

చిరిగిన బ్యాగులతో విద్యార్థుల అవస్థలు

ఆస్పరి: పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన స్కూల్ బ్యాగులు చిరిగిపోయాయి. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఆస్పరి మండలంలోని కలపరి గ్రామానికి చెందిన బోయ గీత ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. స్కూల్ బ్యాగు పూర్తిగా చిరిగిపోవడంతో విద్యార్థిని తాత బోయ గిడ్డయ్యతో ఉదయం సూది దారంతో కుటించుకుని శనివారం పాఠశాలకు వెళ్లింది. మండలంలో 14 జిల్లా పరిషత్ హైస్కూళ్లు, 39 ప్రాథమిక పాఠశాలలు మొత్తం 53 పాఠశాలల్లో 8,241 మంది విద్యార్థులకు ప్రభుత్వం స్కూల్ బ్యాగులు అందించింది. చాలా మంది విద్యార్థులకు బ్యాగులు చిరిగిపోయాయి. కూటమి ప్రభుత్వం నాణ్యత లేని స్కూల్ బ్యాగులు అందించడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.



చిరిగిపోయిన స్కూల్ బ్యాగును కుడుతున్న దృశ్యం

శ్రీశైలం డ్యాం వద్ద ఆక్టోపస్ మాక్‌డ్రిల్



శ్రీశైలం డ్యాం వద్ద మాక్‌డ్రిల్ చేస్తున్న ఆక్టోపస్ బృంద సభ్యులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం డ్యాం వద్ద ఆక్టోపస్ బృందం మాక్‌డ్రిల్ నిర్వహించింది. ముందుగా డ్యాం పరిసర ప్రాంతాలను, తర్వాత కుడి, ఎడమగట్టు ప్రధాన ద్వారాలు, గ్యాలరీ, క్రస్ట్‌గేట్ల బ్రిడ్జి తదితర ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం డ్యాం వ్యూ పాయింట్ వద్ద ప్రాజెక్టు సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీరామచంద్రమూర్తి, డ్యాం ఈఈ వేణుగోపాల్‌రెడ్డి, ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్పీఎఫ్ ఆర్ఐ రాజేష్, హెల్త్ విభాగం, ఫైర్ విభాగాల అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో శ్రీశైలం డ్యాం గురించిన విషయాలను తెలుసుకున్నారు. అనంతరం రాత్రి ఆక్టోపస్ బృందం డ్యాం, వ్యూ పాయింట్, డ్యాం పరిసర ప్రాంతాల వద్ద ఉగ్రవాదులు అనుకోని విధంగా దాడులకు ప్రయత్నిస్తే ఏవిధంగా దాడులను తిప్పికొట్టాలనే విషయాలపై మాక్‌డ్రిల్ నిర్వహించింది.

శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్లతో స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.



మల్లన్న దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు



నీటి గుంతలో ఇరుక్కుపోయిన ఆటో

గుంతలు వెక్కిరిస్తున్నాయ్!

కోసిగి: కూటమి ప్రభుత్వంలో రోడ్ల దుస్థితికి గుంతలో దిగబడిన ఈ ఆటో అద్దం పడుతోంది. యూరియా కొరత ఇప్పటికే తీవ్రరూపం దాల్చగా.. ఓ బస్తాను దక్కించుకునేందుకు రైతులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఇలాంటి సమయంలో అతి కష్టం మీద కొనుగోలుచేసి ఎరువులను తీసుకెళ్తున్న ఆటో బోల్తా పడటంతో రైతులు చుక్కలు చూడాల్సి వచ్చింది. కౌతాళం మండలంలోని చూడి గ్రామం కోసిగి మండలానికి 17 కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడ ఎరువులు దొరక్కపోవడంతో కోసిగిలోని ప్రయివేట్ డీలర్ వద్ద కొనుగోలు చేసేందుకు వచ్చారు. నలుగురు రైతులు 20 బస్తాలు కొనుగోలు చేశారు. అయితే కోసిగి మండల కేంద్రంలోని ఉరుకుంద ఆర్చ్ సమీపంలో చాప వాగు వద్ద రోడ్డు కోతకు గురైంది. గుంతలమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ఈ నేపథ్యంలో ఎరువుల బస్తాలతో వెళ్తున్న ఆటో ఓ గుంతలో ఇరుక్కుపోయింది. ఘటనలో కొన్ని బస్తాలు కిందపడిపోగా రైతులు బయటకు తీసుకొచ్చేందుకు ఇబ్బందిపడాల్సి వచ్చింది. ఇదేసమయంలో అమావాస్య కావడంతో ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి వెళ్లే భక్తులు సైతం ఈ గుంతల రహదారిలో అవస్థలు పడ్డారు.

దివ్యాంగుల కన్నీటికి కారణమెవరు?

- నిర్దయగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం
- వైద్యుల తీరుపై వ్యక్తమవుతున్న విమర్శలు
- ఉమ్మడి జిల్లాలో 8,911 పింఛన్ల తొలగింపు
- గత టీడీపీ పాలనలోని సదరం సర్టిఫికెట్‌లలోనే అనర్హులు అధికం
- 15 నెలలు గడిచినా కొత్త పింఛన్ల ఊసే కరువు

అప్పుడెలా ధ్రువీకరించారు.. ఇప్పుడెలా పరీక్షిస్తున్నారు!

కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పట్ల నిర్దయగా వ్యవహరిస్తోంది. ఇప్పటి వరకు 80 శాతం పైగా ఉన్న వైకల్యం.. ఇప్పుడు 40లోపునకు తగ్గిపోతుండటం కుట్రలో భాగమేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పోలియోతో నడవలేని స్థితిలో ఉన్నా.. వైకల్య శాతం తగ్గించి ఏకంగా పింఛను తొలగింపునకు నోటీసులు ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అనర్హులు అధికంగా పింఛన్లు పొందినట్లు బురదజల్లేందుకు వెళ్లి.. టీడీపీ ప్రభుత్వమే మరక అంటించుకుంటోంది. ప్రస్తుత తొలగింపుల్లో అధిక శాతం అప్పటి ‘పచ్చ’ పాలనలో జారీ చేసిన సదరం సర్టిఫికెట్‌లే ఉండటం గమనార్హం.

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం దివ్యాంగులతో ‘సదరం’గం ఆడుతోంది. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఒక్కటంటే ఒక్కటీ కొత్త పింఛను ఇవ్వలేకపోయింది. ఇదే సమయంలో అనర్హత పేరిట దివ్యాంగుల పింఛన్లలో ఎడాపెడా కోత పెడుతోంది. రీ వెరిఫికేషన్ పేరిట అర్హుల పింఛన్లను కూడా తొలగిస్తూ నోటీసులు ఇస్తుండటం అభాగ్యుల జీవితాలను అయోమయం చేస్తోంది. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన మరుక్షణం నుంచి టీడీపీ నేతల దృష్టి ప్రధానంగా దివ్యాంగుల పింఛన్లపై పడింది. అడ్డదారుల్లో సదరం ధ్రువపత్రాలు పొంది దివ్యాంగుల పింఛన్లు తీసుకుంటున్నారని, ఇలాంటి వాటిని తొలగిస్తామని ప్రకటించారు. ఎట్టకేలకు ప్రభుత్వం పింఛన్ల రీవెరిఫికేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి జిల్లాలో 48,314 పింఛన్లను పునఃపరిశీలించగా.. 8,830 మందిని అనర్హులుగా తేల్చడం గమనార్హం. అదేవిధంగా 1,285 హెల్త్ పింఛన్లను రీ వెరిఫికేషన్ చేయగా.. 81 పింఛన్లను తొలగించారు. అయితే కూటమి నేతలు తాము చేస్తున్న మంచి లేక పోగా.. అనర్హులందరూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోని వారే అన్నట్లుగా ప్రచారం చేయబోయింది. తీరాచూస్తే తొలగించిన పింఛన్ల సదరం సర్టిఫికెట్లు దాదాపుగా ‘పచ్చ’ ప్రభుత్వ సమయంలోనే జారీ చేసినవి కావడంతో ఆ పాపం కూటమి నేతల మెడకే చుట్టుకుంటోంది.

ఒక్కసారిగా వైకల్యం ఎలా తగ్గుతోంది!

సదరం సర్టిఫికెట్‌ల జారీ ప్రక్రియ 2010లో మొదలైంది. 2010 నుంచి 2012 మధ్య సదరం ధ్రువపత్రాలు పొందిన వారిలోనే ఎక్కువ మందిపై అనర్హత వేటు పడుతోంది. 2019–20 నుంచి 2023–24 మధ్య కా లంలో సదరం సర్టిఫికెట్లు పొందిన వారు కూడా అధిక శాతం పింఛన్లు కోల్పోతున్నారు. అప్పట్లో ఎలా ధ్రువీకరించారో, ఇప్పుడు ఎలా పరీక్షిస్తున్నారో కానీ అ ర్హుల కన్నీటికి ఒక రకంగా వైద్యులు కూడా కారణమవుతున్నారు. 80 శాతం పైగా వైకల్యం ఉండగా.. ఒక్కసారిగా 40 శాతం లోపునకు ఎలా పడిపోతుందో వైద్యుల కే తెలియాలి. పింఛన్లను భారీగా తగ్గించాలనే ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే ఈ ప్రక్రియ అడ్డగోలుగా సాగుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇది ఒక ఎత్తయితే.. అనర్హులకు ఏకంగా 90 శాతం పైగా వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరిస్తున్న తీరు విమర్శల పాలవుతోంది.

నాడు 85.. నేడు 40లోపు శాతం



ఈమె పేరు పద్మావతి. కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని బుధవారపేటలో నివాసం. జనవరి 1, 2011న సదరం క్యాంపునకు హాజరైంది. అప్పటి ఆర్థోపెడిక్ వైద్యులు పరీక్షించి 85 శాతం వైకల్యం ఉన్నట్లు నిర్ధారించి సదరం సర్టిఫికెట్ జారీ చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా ఈ ఏడాది మార్చి 6న రీ వెరిఫికేషన్ నిర్వహించారు. అయితే వికలత్వం 40 శాతంలోపే ఉన్నట్లు సర్టిఫికెట్ ఇవ్వడం చూస్తే ఈ ప్రక్రియ ఎంత గందరగోళంగా సాగుతుందో అర్థమవుతోంది. పోలియోతో ఒక కాలు పని చేయని ఈమె వైకల్యం ఎలా తగ్గుతుందో వైద్యులకే తెలియాలి.

క్లుప్తంగా

రోడ్డు దాటుతుండగా..

నంద్యాల: కాలకృత్యాలు తీర్చుకునేందుకు రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్త తెలిపిన మేరకు.. ఒంగోలు జిల్లా కనిగిరి మండలానికి చెందిన దేవదాసు(45) అనే వ్యక్తి కూలీ పనుల నిమిత్తం ఐదు నెలల క్రితం నంద్యాలకు వచ్చారు. శనివారం ఉదయం అతను కాలకృత్యాలు తీర్చుకునేందుకు రైతు నగరం వద్ద ఉన్న జాతీయ రహదారిని దాటుతుండగా హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో దేవదాసు అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమత్తం నంద్యాల ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఈసీలు, మార్కెట్ విలువ పత్రాల జారీలో ఆలస్యం

- అవస్థలు పడుతున్న క్రయ, విక్రయదారులు

కర్నూలు(సెంట్రల్) : కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈసీలు, మార్కెట్ విలువ పత్రాల జారీలో తీవ్ర ఆలస్యం జరుగుతోంది. సిటిజన్ చార్టు ప్రకారం 15 నిమిషాల్లో ఇవ్వాల్సిన పత్రాలజారీకి రెండు రోజుల సమయం తీసుకుంటుండడంతో క్రయ, విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా ఆస్తి కొనుగోలుకు సంబంధించి ఈసీ చాలా కీలకం. దాని ఆధారంగా ఆస్తికి సంబంధించిన వివరాలను తెలుసుకొని కొనుగోలుకు ముందుకెళ్తారు. ఈ సమయంలో ఆ ఆస్తి మార్కెట్ విలువ పత్రం అత్యంత కీలకం. ఈ పత్రాలను 15 నిమిషాల్లో జారీ చేయాల్సి ఉండగా రెండు రోజుల సమయం తీసుకుంటుండడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇబ్బంది పడుతున్నారు. కాగా, అక్కడున్న అధికారులు డబ్బులు ఇచ్చిన వారికే ముందుగా పత్రాలు జారీ చేస్తుండడంతో వరుసలో వచ్చిన వారి పత్రాలు రావడానికి దాదాపు 2 రోజుల సమయం పడుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఇన్చార్జ్ సబ్ రిజిస్ట్రార్ వరప్రసాదుగానీ, ఆయా పత్రాలను జారీ చేసే అధికారులుగానీ నోరు మెదపకపోవడం గమనార్హం.



పాములపాడు సమీపాన కంబాలపాడు వద్ద రంగు మారిన పంట



ఎర్రగూడూరు వద్ద

కరివేన వద్ద పొలంలో ఇంకా తొలగని వర్షపు నీరు



ఆత్మకూరు మండలం క్రిష్ణాపురం పనికిరాకుండా పోయిన పత్తి పొలం



కన్నీరు వర్షిం'చేను'!

నీట మునిగి కుళ్లిపోయిన పైర్లు.. నీరు నిలిచి మొలవని విత్తనాలు... పచ్చని మొక్కలు ఎర్రగా మారిన దృశ్యం.. ప్రకృతి వైపరీత్యం అన్నదాతను మరోసారి నిలువునా ముంచేసింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏక ధాటిగా మూడు రోజుల పాటు కురిసిన వర్షాలు రైతుల కష్టాన్ని నీటి పాలు చేశాయి. కన్నీటి దిగుబడినే మిగిల్చాయి. జలమయం అయిన వరి పొలాలన్నీ పనికి రాకుండా పోయాయి. పత్తి, మొక్కజొన్న, మినుము, మిరప, వేరుశనగ, ఆముదం, ఉల్లి.. ఇలా అన్ని పంటలు వర్షార్పణం అయ్యాయి. పెట్టుబడి అంతా మట్టిపాలై అన్నదాతకు తీరని శోకమే మిగిలింది. – సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



రుద్రవరంలో మొలకెత్తని చేను

బోగస్ ఇళ్ల పట్టాలు స్వాధీనం

సాక్షి టాస్క్‌ఫోర్స్: కొలిమిగుండ్లలో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల స్థలాలకు బోగస్ పట్టాలు ఇస్తున్న ముఠా గుట్టురట్టయింది. ఈ బాగోతంలో అవుకు మండలానికి చెందిన ఓవ్యక్తి కీలక పాత్ర వహించాడని తెలుస్తుంది. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం రాత్రి అవుకు పోలీసులు అతని ఇంట్లో సోదాలు చేసి బోగస్ ఇళ్ల పట్టాలతో పాటు రెవెన్యూ అధికారుల పేర్లతో ఉన్న సీళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తుంది. కొలిమిగుండ్లలో అమాయక ప్రజలకు మాయ మాటలు చెప్పి పదుల సంఖ్యలో ఇళ్ల స్థలాలను లక్షలాది రూపాయలకు విక్రయించారు. శనివారం అవుకు పోలీస్ స్టేషన్‌లో వీటిపై పోలీసులు విచారించారు. అనంతరం కొలిమిగుండ్ల తహసీల్దార్ కార్యాలయానికి బోగస్ పత్రాలు, సీళ్లను తీసుకురావడంతో రెవెన్యూ అధికారులు వాటిని పరిశీలించి బోగస్‌గా తేల్చినట్లు సమాచారం. ప్రభుత్వ స్థలాలను అమ్మిన ముఠాలో ఎంత మంది ప్రమేయం ఉంది, ఎంత మందికి పట్టాలు ఇచ్చారు అనేది తెలియాల్సి ఉంది. బయట వ్యక్తులతో పాటు రెవెన్యూ సిబ్బంది పాత్ర కూడ ఉందా అనేది బయటకు రావాలంటే ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఉపాధి కూలీలకు రూ.2 లక్షల ప్రమాద బీమా

కర్నూలు(సెంట్రల్) : ఉపాధి హామీ కూలీలకు ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు అకౌంట్ ఉంటే రూ.2 లక్షల ప్రమాద బీమా లభిస్తుందని డ్వామా పీడీ వెంకటరమణయ్య పేర్కొన్నారు. ఇటీవల రుద్రవరం మండల కేంద్రానికి చెందిన అన్నలదాసు జనార్దన్ కరెంట్ షాక్‌తో చనిపోయారు. అయితే, అతనికి ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు అకౌంట్ ఉండడంతో రూ.2లక్షల ప్రమాద బీమా మంజూరైంది. శనివారం అన్నలదాసు బాధిత కుటుంబానికి అందుకు సంబంధించిన చెక్కును డ్వామా పీడీ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వలస ప్రభావిత ప్రాంతాల్లో పనులు చేసే కూలీలు అనుకొని ప్రమాదాల్లో మరణిస్తే ప్రభుత్వం ఇచ్చే బీమాతో పాటు ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు అకౌంట్ బీమా లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు జోనల్ మేనేజర్ ఐత నవీన్ శెట్టి, కర్నూలు జిల్లా మేనేజర్ బి.వీరారెడ్డి, కస్టమర్ గ్రీవెన్స్ మేనేజర్ షేక్ మహబూబ్ బాషా, ప్రమోటర్ శివమ్మ, వేణు పాల్గొన్నారు.



ప్రమాద బీమా చెక్‌ను అందజేస్తున్న డ్వామా పీడీ వెంకటరమణయ్య

ట్రాక్టర్ ఢీకొని విద్యార్థికి తీవ్రగాయాలు

జూపాడుబంగ్లా: ట్రాక్టర్ ఢీకొని ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డారు. శనివారం జూపాడుబంగ్లాలో ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తరిగోపుల గ్రామానికి చెందిన భూశయ్య, సావిత్రి దంపతుల రెండో కుమారుడు జనార్దన్ జూపాడుబంగ్లా మోడల్‌స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శనివారం సాయంత్రం పాఠశాల వదలడంతో నడుచుకుంటూ బస్టాండు వైపు వస్తున్నాడు. అదే సమయంలో కూలీలను ఎక్కించుకొని పాములపాడుకు వెళ్తున్న ఏపీ21టీఏ 0923, ఏపీ21టీఏ0924 రెండు నెంబర్లు కలిగిన ట్రాక్టర్‌ను డ్రైవర్ అతివేగంగా నడుపుకొంటూ వచ్చి రోడ్డుపక్కన వెళ్తున్న విద్యార్థిని ఢీకొన్నాడు. ఈ ఘటనలో విద్యార్థి తలకు బలమైన గాయం కావటంతో తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన స్థానికులు ట్రాక్టర్‌ను నిలువరించటంతో డ్రైవర్ ట్రాక్టర్‌ను వదిలి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న కానిస్టేబుల్ షేక్షావలి పోలీసు జీపులో గాయపడిన జనార్దన్‌ను నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యకోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు 108లో తరలించారు. విద్యార్థి తల్లిదండ్రులు ఆసుపత్రికి చేరుకొని గాయపడిన కొడుకును చూసి కన్నీటి పర్యంతమయ్యారు. మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, పాఠశాల సిబ్బంది, నంద్యాల, కర్నూలు డీఈఓలు జనార్దన్, శ్యామ్యూల్ ఆసుపత్రికి చేరుకొని విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.



తీవ్రంగా గాయపడిన విద్యార్థి జనార్దన్

'టెన్'కాయ దోపిడీ రూ. కోటిపైనే !

దోపిడీకి అక్కడ అవధుల్లేవు. అభ్యంతరాలు అంతకన్నా లేవు. భక్తులను నిలువునా దోచుకోవడమే పరమావధి. కాంట్రాక్టర్లు మొదలు మేటీల వరకు ఇదే పంథా. టెంకాయ దక్షిణ మాటున సాగుతున్న ఓ భారీ దందా ఇది. ఒక్క టెంకాయ కొట్టుడు దోపిడీనే రూ.కోటి పైమాట. ఉరుకుంద ఈరన్న క్షేత్రంలో సాగుతున్న దందాలకు భక్తులు తలలు పట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడు లేడు.



ఉరుకుంద ఈరన్న క్షేత్రం



భక్తుల నుంచి టెంకాయ కొట్టేందుకు దక్షిణ తీసుకుంటున్న మేటీలు

- ఉరుకుందలో అడ్డూఅదుపులేని టెంకాయ మేటీల దందా
- ఒక్కో టెంకాయ కొట్టుడుకు భక్తుల నుంచి రూ.10 వసూలు
- శ్రావణమాసం దోపిడే రూ.కోటి పైమాటే
- చోద్యం చూస్తున్న ఆలయాధికారులు

అధికారుల కళ్లెదుటే ఈ దందా

భక్తుల సెంటిమెంట్ ముసుగులో దక్షిణ ఓ భాగం.ఆ సెంటిమెంట్ ఆసరాగా చేసుకొని రూ.కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారు. ఇదంతా ఆలయంలోనే అధికారుల కళ్లెదుటే సాగుతోంది. భక్తులు అక్కడే దక్షిణ ఇచ్చుకోలేమని మొత్తుకుంటున్నా అటు వైపు చూడరు. మేటీల దక్షిణకు అక్కడ ఓ పద్ధతి అంటూ లేదు. ఇంత దక్షిణ తీసుకోవాల న్న నియమం లేదు. ప్రైవేటు మేటీలు టెంకాయ లు కొట్టేందుకు ఆలయంలోనే ప్రత్యేక కట్టను నిర్మించారు. ఏ క్షేత్రంలోనూ ఈ సంస్కృతి కనిపించదు. అయినా మేటీల వసూళ్లకు నిబంధనలు పెట్టకపోవడంపై భక్తులు విస్తుపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు దక్షిణ దందాకు స్వస్తి చెప్పేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

మంత్రాలయం : మంత్రాలయం నియోజకవర్గ పరిధిలోని కౌతాళం మండలంలోని ఉరుకుంద గ్రామ సమీపంలో ఈరన్నస్వామి వెలిశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో స్వామి భక్తులు ఉన్నారు. ఉరుకుంద క్షేత్రంలో శ్రావణమాసం ఉత్సవాలు ప్రత్యేకం. నెల రోజుల పాటు ఈ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. మాసంలో దాదాపు 4–5 లక్షల భక్తులు క్షేత్రాన్ని సందర్శిస్తారు. భక్తులు స్వామి వారికి జోడు టెంకాయలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది 5 లక్షలకుపైగా భక్తులు క్షేత్రాన్ని సందర్శించినట్లు అధికారిక లెక్క.

రూ.కోటి కొట్టేశారు

ఈరన్న స్వామి క్షేత్రం పరిధిలో తొలి నుంచి మూడు మేటీల కుటుంబాలు టెంకాయలు కొట్టడం ఆనవాయితీగా వస్తోంది. శ్రావణమాస ఉత్సవాల్లో ఇక్కడ దాదాపు 10 లక్షల టెంకాయలు భక్తులు సమర్పిస్తారు. ఒక టెంకాయ కొట్టడానికి రూ.10 చొప్పున వసూలు చేస్తున్నారు. భక్తులు మొండికేసినా ముక్కుపిండి వసూలు చేయడం పరిపాటి. ఈ లెక్కన 10 లక్షల టెంకాయలు కొడితే వారికి వచ్చే ఆదాయం రూ.కోటి. చూడటానికి చిన్నగానే కనిపిస్తోంది. అయితే, లెక్క తేల్చితే అక్షరాల రూ.కోటి. కాగా శ్రావణ మాసం మినహా క్షేత్రానికి ప్రతి అమావాస్య రోజున వేలాది మంది భక్తులు సందర్శిస్తారు. అమావాస్య రోజున కనీసం 20 వేల టెంకాయలకు మించి భక్తులు సమర్పిస్తారు. పన్నెండు అమావాస్యలకుగానూ రూ.24 లక్షలు వస్తోంది. ఇక సోమ, గురువారాలు సైతం క్షేత్రంలో రద్దీ ఉంటుంది. ఇలా ఏడాదికి టెంకాయ కొట్టుడు రూపంలో దక్షిణ సంపాదన దాదాపు రూ.1.50 కోట్లు పైగానే. ఈసారి ఆలయ శ్రావణ మాసం హుండీ ఆదాయం రూ.4.30 కోట్లు వచ్చింది. హుండీ ఆదాయంలో పావు వంతుతో సమానంగా కొట్టుడు దోపిడీ ఉండటం నిజంగా ఆశ్చర్యకరం.

రేపు జిల్లా స్థాయి మహిళల సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 25 వ తేదీన స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి సీనియర్స్ మహిళల సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎం.కుబేర నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 30,31 తేదీల్లో గుంటూరు జిల్లా సత్తెనపల్లెలో నిర్వహించనున్న 12 వ రాష్ట్ర స్థాయి బాలికల సీనియర్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో ఆసక్తి కలిగిన క్రీడాకారులు 4 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, ఒరిజినల్ ఆధార్ కార్డుతో పాల్గొనాలని తెలిపారు. వివరాలకు 7032088008 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చౌకదుకాణాలు తనిఖీ చేసిన జేసీ

కర్నూలు(సెంట్రల్): నగరంలోని బుధవారపేటలో ఉన్న 70,73,75 చౌకదుకాణాలను జేసీ డాక్టర్ బి.నవ్య శనివారం తనిఖీ చేశారు. అయితే, దుకాణాల డీలర్లు సరైన సమయంలో బియ్యం వేస్తున్నారని, తూకాల్లో మోసం చేయడం లేదని, బియ్యం బాగు ఉంటుందోని అక్కడి ప్రజలు చెప్పినట్లు ఆమె చెప్పారు. అయితే, ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో ప్రజలకు సరుకులు వేయరు. ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 18వ తేదీ వరకు మాత్రమే సరుకులు ఇస్తారు. అయితే జాయింట్ కలెక్టర్ ఈసమయంలో వెళ్లి ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకొని అంతా సవ్యంగా ఉందంటూ చెప్పడం విమర్శలకు తావిస్తోంది. ఆమె వెంటనే డీఎస్ఓ రాజారఘువీర్, అర్బన్ తహసీల్దార్ రవికుమార్, ఏఎస్ఓ వెంకటరాజు ఉన్నారు.

నర్సింగ్ పరీక్షల్లో కాపీయింగ్‌కు తావివ్వొద్దు



పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): నర్సింగ్ సప్లిమెంటరీ పరీక్షల్లో కాపీయింగ్‌కు తావివ్వకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని ఎగ్జామినేషన్ హాలులో నిర్వహిస్తున్న జీఎన్ఎం సప్లిమెంటరీ పరీక్షలను శనివారం ఆయన తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. చేపట్టిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, పర్సులు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష కేంద్రంలోకి తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని చెప్పారు. పరీక్షలకు చీఫ్ ఎగ్జామినర్‌గా ఆసుపత్రి ఇన్‌ఛార్జి సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల, ముగ్గురు మెడికల్ ఆఫీసర్లు, 14 మంది హెడ్‌నర్సులు, స్టాఫ్‌నర్సులు పరీక్షలను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

అశోకుడి శిలాశాసనాల సందర్శన

తుగ్గలి : మండలంలోని జొన్నగిరి సమీపంలో అశోకుడి శిలాశాసనాలను ఫారెస్ట్ అడిషనల్ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ చలపతిరావు శనివారం తన కుటుంబ సభ్యులతో సందర్శించారు. కర్నూలు నుంచి గుత్తికి వెళ్తూ మార్గ మధ్యలో జొన్నగిరి వద్ద అశోకుని శిలాశాసనాలను సందర్శించి శాసనాలను పరిశీలించారు. పెద్ద రాతి బండపై చెక్కిన శాసనాల గురించి ఆరా తీశారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ డీఎఫ్ఓ విఘ్నేష్అప్పావు, స్క్వాడ్ డీఎఫ్‌వో రవి శంకర్, ఆదోని ఎఫ్ఆర్‌వో తేజస్వి, సిబ్బంది లక్ష్మన్న తదితరులు ఉన్నారు.



జొన్నగిరి సమీపంలోని అశోకుడి శిలాశాసనాలను పరిశీలిస్తున్న చీఫ్ కన్సర్వేటర్ చలపతిరావు

పండ్ల మొక్కలు నాటే కార్యక్రమం ముమ్మరం

- ఉపాధి సిబ్బందికి డ్వామా పీడీ వెంకటరమణయ్య ఆదేశం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఆశాజనకంగా వర్షాలు పడినందున పండ్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన తన కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా హార్టికల్చర్ ప్లాంటేషన్, విత్ హెల్డ్ అమౌంటు తదితర వాటిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2025–26లో 4300 హెక్టార్లలో పండ్లతోటలు అభివృద్ధి చేయాలనేది లక్ష్యమని, ఇప్పటి వరకు 3000 ఎకరాల్లో ప్లాంటేషన్ జరిగిందని తెలిపారు. మిగిలిన 1300 ఎకరాల్లోనూ ప్లాంటేషన్ పనులను ఈ నెల చివరిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పండ్ల మొక్కలు నాటే కార్యక్రమంపై ఏపీవోలు, టీఏలు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. జిల్లాలో దాదాపు 12 వేల పనులకు సంబంధించి రూ.4 కోట్లు విత్‌హెల్డ్‌లో ఉన్నట్లు తెలిపారు. పీవోలు, ఏపీవోలు ఈ పనులను రీ ఓపన్ చేసి ఎఫ్‌టీవో జనరేట్ చేయాలని సూచించారు. ఇందుకు ఈ నెల 25 వరకు మాత్రమే అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో అదనపు పీడీ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.